క్లుప్తంగా

రణమండల కొండలో శాంతిహోమం



శాంతిహోమం నిర్వహిస్తున్న భక్తులు

ఆదోని అర్బన్: పట్టణశివారులోని రణమండల కొండలో వెలిసిన శ్రీ సంతాన ఆంజనేయ స్వామి ఆలయంలో ఆదివారం శాంతి హోమం నిర్వహించారు. ఆలయానికి ధ్వజస్తంభం, పాదాలు, గోపురానికి కలశం, వినాయక విగ్రహం ప్రతిష్టాపన చేసి 41 రోజులు పూర్తయిన సందర్భంగా ఈ హోమం చేపట్టారు. రణమండల ఆంజనేయస్వామి ఆలయ నిర్వాహకులు టీజీ పాండురంగయ్యశెట్టి ఆధ్వర్యంలో కార్యక్రమ నిర్వాహకుడు ఏటీఎం శివ కుమార్ పూజలు చేయించారు. ముందుగా సంతాన ఆంజనేయస్వామికి పంచామృతాభిషేకం, సింధూరసేవ, తులసీహారం, ప్రత్యేక పూల అలంకరణతో పూజలు నిర్వహించారు. అనంతరం వేద పండితుల మధ్య శాంతిహోమం నిర్వహించారు.

సామాజిక అంశాలపై అవగాహన పెంచుకోవాలి



గెలిచిన జట్టుకు బహుమతి అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ఆదోని సెంట్రల్: విద్యార్థినీ, విద్యార్థులు చదువుతో పాటు సామాజిక అంశాలపై కూడా అవగాహన కలిగి ఉండాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసులు సూచించారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకొని విద్యార్థినులకు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పట్టణంలోని మంత్రాలయం బీసీ బాలికల వసతి గృహంలో ఆదివారం కబడ్డీ పోటీలను నిర్వహించారు. అనంతరం కబడ్డీ పోటీల్లో గెలుపొందిన సీనియర్ జట్టుకు బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ నాయకులు నాగరాజు, శశిధర్, పవన్, సంతోష్ పాల్గొన్నారు.

సూక్ష్మ కళాకారుడికి సత్కారం



సూక్ష్మకళాకారుడు బారికి చంద్రశేఖర్ దంపతులను సత్కరిస్తున్న వేదపండితులు

ఎమ్మిగనూరుటౌన్: సూక్ష్మకళలో నూతన ఆవిష్కరణలు చేస్తూ పేరు సంపాదించుకున్న పట్టణానికి చెందిన సూక్ష్మ కళాకారుడైన డాక్టర్ బారికి చంద్రశేఖర్, పార్వతి దంపతులను ఆదివారం తిరుపతిలోని యూత్ హాస్టల్‌లో అక్కడి వేదపండితులు ఘనంగా సత్కరించారు. సూక్ష్మకళారంగంలో మరిన్ని ఆవిష్కరణలు చేయాలని కోరుతూ గోమాత పురస్కారం అందించి, వేదపండితులు మంత్రోచ్ఛరణలతో ఆశీర్వదించారు. కార్యక్రమంలో దార్లపుడి శంకర గిరి శాస్త్రి, లింగాల బ్రహ్మాజీ శర్మ, రిషబ్ దీక్షిత్, భరద్వాజ శర్మ, సాయికుమార్ శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

బదినేహాల్‌లో బండలాగుడు పోటీలు



బండలాగుడు పోటీలు ప్రారంభిస్తున్న దృశ్యం

కౌతాళం: మండల పరిధిలోని బదినేహాల్ గ్రామ శివారుల్లో వెలసిన సిద్ధశంకర్‌స్వామి ఆరాధనోత్సవాలను పురస్కరించుకొని ఆదివారం ఎద్దుల బండలాగుడు పోటీలను నిర్వహించారు. పోటీలను వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు వీరభద్రగౌడ్ ప్రారంభించారు. పోటీల్లో హళేప్పగారి నాగరాజు ఎద్దులు ప్రథమ బహుమతిని, ద్వితీయ బహుమతిని కంశిబాషా ఎద్దులు కైవసం చేసుకున్నాయి.

బైపాస్ రోడ్డు పనులను వెంటనే పూర్తి చేయాలి



బైపాస్ నిర్మాణం పనులను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

ఆదోని రూరల్: పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణ కోసం నిర్మాణంలో ఉన్న ఆలూరు బైపాస్ రోడ్డును వెంటనే పూర్తి చేయాలని సీపీఎం జిల్లా నాయకులు రామాంజనేయులు, వెంకటేశులు, సీనియర్ నాయకులు ఈరన్న, మహానందరెడ్డి, పట్టణ కార్యదర్శి లక్ష్మన్న, గోపాల్ డిమాండ్ చేశారు. ఆదివారం బైపాస్ రోడ్డు పనులను పరిశీలించారు. వారు మాట్లాడుతూ పట్టణంలో ట్రాఫిక్ సమస్యతో ప్రజలు నిత్యం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ట్రాఫిక్ సమస్య పరిష్కారానికై బైపాస్ రోడ్డు పనులు పూర్తి చేయడానికి అధికారులు, పాలకులు ప్రత్యేక చొరవ చూపాలని కోరారు.

ఉన్నది ఒకటే జిందగీ!

- క్షణికావేశాలతో బలవన్మరణాలు
- చిన్న చిన్న సమస్యలకే కుంగుబాటుకు లోనవుతున్న వైనం
- గోనెగండ్ల మండలంలో ఏడాది కాలంలో 20కి పైగా ఆత్మహత్యలు
- ఒక్క డిసెంబర్ నెలలోనే నలుగురు అర్ధంతరంగా జీవితం ముగింపు
- మరణించివారు ఎక్కువగా 20 నుంచి 50ఏళ్ల లోపువారే
- కుటుంబ సభ్యులకు తప్పని శోకం

జీవిత ప్రయాణం ముగించే మరణం సహజంగా ఉంటేనే ఆ జీవితానికి సార్థకత, జీవితంలో ఎదురయ్యే అటుపోట్లను తట్టుకోలేక చిన్న చిన్న సమస్యలకే కుంగిపోయి కొందరు అర్ధంతరంగా తనువు చాలిస్తున్నారు. క్షణికావేశంలో తీసుకున్న నిర్ణయాలు ఎన్నో బంధాలను చిదిమేస్తున్నాయి. అయిన వారిని, కన్నవారిని పుట్టెడు దుఃఖంలోకి నెట్టేస్తున్నాయి. సమస్య ఏదైనా ఓర్పుగా పరిష్కారం వైపు అడుగులు వేయాలే తప్ప భయపడి బలవన్మరణానికి పాల్పడితే నమ్ముకున్న వారి పరిస్థితి ఏమిటో గ్రహించాలి. అనుబంధాలు, ఆత్మీయతలను ఒక్కసారి గుర్తు చేసుకుని ముందుకు సాగిపోతే ఎలాంటి సమస్యలైనా జయించవచ్చని, నిండు నూరేళ్లు సంతోషంగా గడిపేయవచ్చని మానసిక వైద్య నిపుణులు చెబుతున్నారు.

గోనెగండ్లకు చెందిన రాజు (28) అనే యువకుడు కూలీ పనులు చేసుకుంటూ ఇల్లు కట్టుకున్నాడు. అయితే ఇంటి నిర్మాణం కోసం చేసిన అప్పులు చేశాడు. ఆ అప్పులు తీర్చలేక 2024 డిసెంబర్ 19న పురుగు మందు తాగాడు. కర్నూలులో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఇతనికి భార్య సునితమ్మ, ఇద్దరు కుమారులు, కూతురు సంతానం .కుటుంబ పెద్ద చనిపోవడంతో పిల్లల పోషణ భారం అతని భార్యపై పడింది. దీంతో ఆమె కూలీపనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటోంది. పిల్లలు చిన్నవారు (ఐదేళ్ల లోపు) కావడంతో వారిని నాయనమ్మ (రాజు తల్లి) వద్ద ఉంచి కూలీ పనులకు వెళ్లాల్సి వస్తోంది. ఇలా చాలా మంది జీవితాలను అర్ధతంరంగా ముగించేసుకొని వారి కుటుంబాలకు తీరనివేదన మిగుల్చుతున్నారు

గోనెగండ్ల : మండలంలో ఇటీవల కాలంలో ఆత్మహత్యలు పెరిగిపోయాయి. గోనెగండ్ల మండలంలో ఏడాది కాలంలో దాదాపు 20 మందికిపైగా ఆత్మహత్య చేసుకున్నారు. ఒక్క డిసెంబర్ నెలలోనే నలుగురు ఆత్మహత్య చేసుకున్నారు. ఇవి పోలీసు కేసులు నమోదైనవి మాత్రమే. ఆత్మహత్యలు చేసుకుని లెక్కలోకి రానివి కూడా ఉన్నాయి. ఆత్మహత్యలు చేసుకుంటున్న వారిలో అధికశాతం మంది 20 నుంచి 50 ఏళ్ల లోపు వారే ఉంటున్నట్లు తెలుస్తోంది. 50 ఏళ్ల పై బడిన వారిలోనూ ఈ ధోరణి అధికంగా ఉంటోందని మానసిక నిపుణులు చెబుతున్నారు. సమస్యలకు గురైనప్పుడు క్షణికావేశంలో తీసుకునే నిర్ణయాలతోనే అనర్థాలు జరుగుతున్నాయి.

సకాలంలో గుర్తించకపోవడంతో..

కుటుంబ సమస్యలనో, ఆర్థిక ఇబ్బందులనో, అప్పుల బాధ తాళలేకనో, అనారోగ్యమనో, పరీక్షల్లో తప్పామనో.. ప్రేమ విఫలమైందనో ఇలా రకరకాల కారణాలతో అతిగా ఆలోచించి బలవంతంగా ప్రాణాలు తీసుకుంటున్న ఘటనలు చోటుచేసుకుంటూనే ఉన్నాయి. మానసికంగా కుమిలిపోతున్న వారిని కుటుంబసభ్యులు సకాలంలో గుర్తించక పోవడం, గుర్తించినా తగిన జాగ్రత్తలు తీసుకోకపోవడం, ప్రధానంగా విద్యార్థులు, యువతపై తమ అభిప్రాయాలను తల్లిదండ్రులు బలవంతంగా రుద్దడం కూడా ఆత్మహత్యలకు కారణమవుతోందని మానసిక నిపుణులు అభిప్రాయపడుతున్నారు. మరోవైపు యువత పరిపక్వం చెందని వయసులో తప్పుడు నిర్ణయాలతో బలవన్మరణాలకు పాల్పడుతున్నారు.

చట్టం ఇలా...

ఆత్మహత్యకు పాల్పడడం, యత్నించడం, అందుకు ప్రోత్సహించడం చట్టప్రకారం నేరం. ఆత్మహత్యకు ప్రయత్నించిన వారిపై భారత న్యాయి సంహిత (బీఎన్ఎస్) సెక్షన్ 226 కింద, ఆత్మహత్యకు ప్రోత్సహించే వారిపై సెక్షన్ 108 కింద కేసు నమోదు చేస్తారు.

మానసిక కుంగుబాటు లక్షణాలు...

ఆత్మహత్యకు పాల్పడేవారిని ముందే గుర్తించవచ్చని మానసిక నిపుణులు చెబుతున్నారు. ఆత్మహత్య చేసుకోవాలనుకున్న వారు కొన్ని అసాధారణ లక్షణాలను కలిగి ఉంటారు.

- ఒంటరితనాన్ని కోరుకుంటారు. అతిగా మద్యం తాగుతారు.
- ప్రతీకారం తీర్చుకోవడం పైనే ఎక్కువగా మాట్లాడుతుంటారు.
- తీవ్ర మానసిక ఒత్తిడికి లోనవడం, అతిగా నిద్రపోవడం.
- రాత్రిపూట నిద్రపోకుండా ఎక్కువగా ఆలోచించడం.
- అసలు దేనికి స్పందించకపోవడం, చనిపోతున్నట్లు ముందుగానే పరోక్షంగా సంకేతాలు ఇవ్వడం లాంటివి చేస్తుంటారు.



ఇలా చేయాలి...

ఆత్మహత్య భావనలో ఉన్న వారిని ఒంటరిగా ఉంచరాదు. వీలైనంతవరకు ఇంట్లో వారందరి మధ్య ఉంచి కుటుంబ సభ్యులంతా వారిలో ధైర్యం నింపాలి. వీలైనంత వరకు ఆత్మహత్య భావన ఉన్నవారికి ఆత్మహత్యకు సహకరించే వస్తువులను అందుబాటులో లేకుండా చూడాలి. ఆత్మవిశ్వాసం, పాజిటివ్ థింక్ పుస్తకాలు, బిహేవియర్ థెరపీ, కౌన్సెలింగ్ ప్రక్రియలు శక్తివంతంగా ఉపయోగపడుతాయి. వీలైతే మానసిక వైద్య నిపుణులచే కౌన్సెలింగ్ ఇప్పించాలి.

ప్రశాంతంగా బతకడం అలవర్చుకోవాలి



మానవ జీవతం అంటే ఒడిదొడుకులు ఉంటాయి. కష్ట సుఖాలను సమపాలలో తీసుకోవాలి. దేనికి బెదరకూడదు. కుంగిపోకూడదు. సమస్యలు వచ్చినప్పుడు వాటిని ఎదుర్కోవడానికి ప్రయత్నించాలి. ముఖ్యంగా మహిళలు ఇంట్లో సమస్యలను తలకెక్కించుకోకూడదు. తేలిగ్గా తీసుకుని బతకడం నేర్చుకోవాలి. భర్త తప్పు చేస్తే పెద్దలకు చెప్పడం లేదా.. పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయవచ్చు. ప్రేమించి మోసం చేస్తే వాటిని ఏరకంగా ఎదుర్కోవాలో తెలుసుకోవాలి. క్షణికావేశంలో నిర్ణయాలు తగదు. ప్రతి సమస్యకు చావే పరిష్కారం కాదు. ఎలాంటి సమస్య వచ్చినా ఒత్తిడికి లోనుకాకుండా ప్రశాంతంగా ఆలోచిస్తే పరిష్కారం దొరుకుతుంది. – గంగాధర్, సీఐ గోనెగండ్ల

మండలంలో గత నెలలో జరిగిన ఆత్మహత్య ఘటనలు

- గోనెగండ్లకు చెందిన కురువ రంగముని(48) అనే రైతు అప్పుల బాధతాళ లేక డిసెంబర్ 13న ఇంట్లో ఎవరు లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని భార్య నాగమ్మ ఫిర్యాదు మేరకు రైతు ఆత్మహత్యగా పోలీసులు కేసు నమోదు చేశారు.
- హెచ్. కైరవాడి గ్రామానికి చెందిన ఈడిగ విజయ్(20) అనే యువ కౌలు రైతు అప్పుల బాధ తాళలేక డిసెంబర్ 16న పొలం దగ్గరకు వెళ్లి పురుగు మందు తాగాడు. కర్నూలు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుని తల్లి సుజాత ఫిర్యాదు మేరకు కౌలు రైతు ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు కేసు నమోదు చేశారు.
- పిలిగుండ్ల గ్రామానికి చెందిన బోయ నరసింహులు(47) అనే కౌలు రైతు అప్పుల బాధ తాళలేక డిసెంబర్ 26న గ్రామంలో ఈశ్వర దేవాలయం దగ్గర చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య పార్వతి ఫిర్యాదు మేరకు కౌలు రైతు ఆత్మహత్యగా పోలీసులు కేసు నమోదు చేశారు.

అతిగా ఆలోచించకూడదు



పెరుగుతున్న జీవన ప్రమాణాలు, మారుతున్న విధానాలతో ఆత్మస్థైర్యాన్ని కోల్పోతున్నారు. సమస్యలు ఎవరికీ చెప్పుకోలేక ఎవరికి వారే కుమిలిపోతున్నారు. అతిగా ఆలోచించకుండా మనోధైర్యాన్ని కోల్పోకుండా ఇతరులతో పంచుకొని సమస్యను పరిష్కరించుకోవాలి. సమస్యలను కుటుంబ సభ్యులు, మిత్రులతో చర్చించాలి. లేకపోతే మానసిక వైద్యులను సంప్రదించాలి. సమస్యకు పరిష్కార మార్గాలు చూసుకోవాలి కానీ ఆత్మహత్యలు పరిష్కారం చూపవు. జీవన ఆశయాల గురించి ఆలోచించాలి. జీవితంలో పిల్లలు, స్నేహితులతో ఆనందంగా గడిపిన క్షణాలను గుర్తుకుతెచ్చుకోవాలి. విపరీత నిర్ణయాలు తీసుకుంటే మనపైన ఆధారపడిన వారి జీవితం ఏమవుతుందో యోచించాలి.
– డాక్టర్ కార్తీక్, వైద్యాధికారి, గోనెగండ్ల

రహదారి నిబంధనలు పాటించాలి



వాహనాన్ని తనిఖీ చేస్తున్న సీఐ గంగాధర్

గోనెగండ్ల : వాహనాలు నడిపే వారు రోడ్డు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సీఐ గంగాధర్ అన్నారు. ఆదివారం సాయంత్రం గాజులదిన్నె ప్రాజెక్టు స్టేజ్ వద్ద ఎమ్మిగనూరు, కర్నూలు ప్రధాన రహదారిపై వాహనాల తనిఖీ చేపట్టారు. వాహనానికి సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు లేని వారికి, అలాగే మద్యం సేవించి వాహనం నడిపిన వారికి, డ్రైవింగ్ లైసెన్స్ లేని వారికి చలనా విధించారు. ఆయన మాట్లాడుతూ వాహన దారులు వాహనానికి సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరిగా వద్ద ఉంచుకోవాలన్నారు. ద్విచక్ర వాహదారులు హెల్మెంట్ ధరించాలని సూచించారు.

ఈద్గా రహదారికి మరమ్మతులు



ఈద్గా రహదారి పనులను పరిశీలిస్తున్న గ్రామ సర్పంచ్, ముస్లింలు

నందవరం : మండల పరిధిలోని ముగతి గ్రామంలో ఈద్గాకు వెళ్లే రహదారికి మరమ్మతులు చేపట్టారు. ఆదివారం గ్రామంలో గ్రామ సర్పంచు విరూపాక్షిరెడ్డి పంచాయతీ నిధులు వినియోగించి ఈద్గాకు ఎర్రమట్టి వేయించారు. అనంతరం సర్పంచ్, ముస్లిం పెద్దలు పనులను పర్యవేక్షించారు. దాదాపు కొన్ని సంవత్సరాలుగా గ్రామంలో ఈద్గాకు, అట్టువైపు రైతుల పొలాలకు రహదారి లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సమస్యను సర్పంచ్ దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే పంచాయతీ నిధులను ఉపయోగించి గ్రావెల్ రోడ్డును వేయించారు. దీంతో రైతులు, ముస్లిం సోదరులు, గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ గణపతి, వార్డు మెంబర్లు బజారప్ప, నాగేష్, దౌలత్, సోమశేఖర్‌రెడ్డి, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి, ఉద్యోగ కల్పనలో ప్రభుత్వాలు విఫలం



ఏఐవైఎఫ్ రాష్ట్ర మహాసభ లోగోను ఆవిష్కరిస్తున్న ఆ సంఘ నాయకులు

ఎమ్మిగనూరుటౌన్: యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలను కల్పించడంలో రాష్ట, కేంద్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీరాములు శ్రీనివాసులు ఆరోపించారు. ఫిబ్రవరి 6 నుంచి 9వ తేదీ వరకు శ్రీకాకుళంలో నిర్వహించనున్న ఏఐవైఎఫ్ రాష్ట్ర 22వ మహాసభల లోగోను ఆ సంఘ జిల్లా ఉపాధ్యాక్షుడు రాజు, సహాయకార్యదర్శి రాజీవ్ నాయకులతో కలిసి ఆదివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమరావతిని ఫ్రీజోన్‌గా ప్రకటించాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో అధికారంలోకి వస్తే దేశంలో రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పిన బీజేపీ 11ఏళ్లు అయినా ఇచ్చిన హామీని నేటికి అమలు చేయలేకపోతుందన్నారు. సమావేశంలో ఏఐవైఎఫ్ నాయకులు జాఫర్, రాజు, భాస్కర్, జెరుసలేం, నరసింహులు, ప్రదీప్, జాని తదితరులు పాల్గొన్నారు.

వలసలు పెరుగుతున్నా పట్టించుకోని అధికారులు



మాట్లాడుతున్న ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కె.లింగన్న

ఆదోని రూరల్: మండలంలో వలసల పర్వం కొనసాగుతున్నా అధికారులకు, ప్రజాప్రతినిధులకు చీమ కుట్టినట్లు కూడా లేదని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కె.లింగన్న, మండల కార్యదర్శి డి.రామాంజనేయులు అన్నారు. ఆదివారం మండలంలోని గణేకల్, బల్లేకల్, జాలిమంచి గ్రామాల నుంచి దాదాపు 150 కుటుంబాలు ప్రకాశం జిల్లా దోర్నాలకు వలస వెళ్లారని చెప్పారు. వలసలు వెళ్తున్న కూలీలతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. స్థానికంగా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయకపోవడంతోనే కూలీలు వలసలకు కారణమన్నారు. మండలంలో సాగునీరు ప్రాజెక్టుల ద్వారా పంట పొలాలకు నీటి సౌకర్యం ఉంటే ఒక్కరు కూడా వలస వెళ్లడానికి అవకాశం ఉండేది కాదన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి బి.వీరారెడ్డి, డీవైఎఫ్ఐ మండల నాయకులు వీరేష్, రామకృష్ణ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ మరింత బలోపేతానికి కృషి



బందెనవాజ్‌ను సన్మానిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

గోనెగండ్ల : వైఎస్సార్‌సీపీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని పార్టీ జిల్లా కార్యదర్శిగా నియమితులైన బందెనవాజ్ అన్నారు. జిల్లా కార్యదర్శి (సంస్థ)గా నియమిస్తూ పార్టీ అదిష్టానం ప్రకటించడంతో ఆదివారం మండల కేంద్రం గోనెగండ్ల పార్టీ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బందెనవాజ్‌ను ఘనంగా సన్మానించారు. బందెనవాజ్ మాట్లాడుతూ తనకు పార్టీలో జిల్లా పదవికి ఎంపికచేయడం ఆనందంగా ఉందని, పార్టీలో ప్రతి ఒక్కరికీ రుణపడి ఉంటానన్నారు. పార్టీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు చికెన్ రాజా, రఫీక్, పద్మనాభం, తిక్కయ్య స్వామి, ఉస్మాన్, నదిముల్లా, అబుసావలి, ముల్లా ఉసేన్ వలి, వలి, నభిరసూల్ తదితరులు పాల్గొన్నారు.

ఉరుకుందలో రేపు హుండీ ఆదాయం లెక్కింపు

కౌతాళం: జిల్లాలో ప్రసిద్ధి చెందిన ఉరుకుంద ఈరన్నస్వామి ఆలయం హుండీ ఆదాయాన్ని మంగళవారం లెక్కించనున్నట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ విజయరాజు తెలిపారు. హుండీ లెక్కింపులో పాల్గొనే ప్రతి ఒక్కరూ పంచ, ఉత్తరీయము (టవల్) తప్పక ధరించాలని కోరారు.

11న విజయవాడలో ధర్నా

ఎమ్మిగనూరుటౌన్: విద్య, ఉపాధ్యాయ సమస్యలపై ఈనెల 11వ తేదీన విజయవాడ ధర్నా చౌక్‌లో డీటీఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు డీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కరెకృష్ణ, జిల్లా అధ్యక్షుడు వెంకట్రాముడు తెలిపారు. ఆదివారం పట్టణంలోని డీటీఎఫ్ ప్రాంతీయ కార్యాలయంలో విద్య, ఉపాధ్యాయ సమస్యలపై నిర్వహించే పోరుబాట ధర్నా కరపత్రాలను డీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ గోట్ల చంద్రశేఖర్, సంఘ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ రాష్ట్రంలో దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా వున్న విద్యారంగ సమస్యలను సత్వరం పరిష్కరించాలని కోరారు. నూతన పీఆర్సీని ఏర్పాటు చేసి 30 శాతం మధ్యంతర భృతిని ప్రకటించాలని, ఉపాధ్యాయులకు నెల వారీ పదోన్నతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. సమావేశంలో డీటీఎఫ్ నాయకులు పాటిల్ ఈశ్వర్‌రెడ్డి, జగదీష్, రవీంద్ర, వీరేష్, వెంకటాచలం తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

కోసిగి: మండల కేంద్రంలోని నడిమి పాళెం ఎస్సీ కాలనీలో నివాసం ఉంటున్న బాల స్వామి పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ కలహాల కారణంగా మనస్తాపానికి గురై ఆదివారం ఇంట్లో ఉన్న పురుగు మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు కోసిగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లారు. అక్కడ వైద్యులు ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం 108 వాహనంలో ఆదోని ఏరియా ఆసుపత్రికి తరలించారు.

ఏఐవైఎఫ్ మహాసభలను జయప్రదం చేయండి

మంత్రాలయం : మంత్రాలయంలో ఈనెల 7న నిర్వహిస్తున్న ఏఐవైఎఫ్ మండల మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం తాలూకా కార్యదర్శి ఎం.రాజు పిలుపునిచ్చారు. ఆదివారం మంత్రాలయంలో ఏఐవైఎఫ్ మండల ముఖ్య నాయకులతో సమావేశంలో నిర్వహించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలు గడిచినా ఖాళీగా ఉన్న 2.70లక్షల ఉద్యోగాలు భర్తీ చేయకపోవడం దారుణమన్నారు. డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేస్తామని నేటికి విడుదల చేయక కాలయాపన చేయడం సిగ్గుచేటన్నారు. నిరుద్యోగ భృతి చెల్లిస్తామని చెప్పి ఇంత వరకు ఆచరణలో తీసుకురాలేదన్నారు. నిరుద్యోగ సమస్యల పై మండల మహాసభలో చర్చించి ఉద్యమాలకు కార్యాచరణ రూపొందిస్తామన్నారు. యువకులు, సంఘం సభ్యులు సభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సంఘం తాలుకా అధ్యక్షుడు జాఫర్, రాజు, నరసింహులు, జానీ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్ల రాత పరీక్ష కేంద్రం పరిశీలన



పరీక్షా కేంద్రంలో విద్యార్థులను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ఆదోని రూరల్: పట్టణంలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఆదివారం జరిగిన రేషన్ డీలర్ల రాత పరీక్షా కేంద్రాన్ని సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్ తనిఖీ చేశారు. సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ 78 చౌకధరల దుకాణాలకు శాశ్వత ప్రాతిపదికన డీలర్లను నియమించేందుకు డిసెంబర్ 23వ తేదీన నోటిఫికేషన్ జారీ చేశామన్నారు. 512 దరఖాస్తులు వచ్చాయన్నారు. ఇందులో 472 దరఖాస్తులను అంగీకరించగా, 40 దరఖాస్తులను తిరస్కరించినట్లు తెలిపారు. ఆదివారం నాడు రాత పరీక్ష నిర్వహించినట్లు చెప్పారు. ఇందులో ఉత్తీర్ణులైన వారిలో 1:5 నిష్పత్తిలో సోమవారం ఉదయం 9 గంటలకు సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

ఆదోని అర్బన్: మండలంలోని కడితోట గ్రామ సమీపంలో ఆదివారం కారు, ఆటో ఢీకొని నలుగురికి గాయాలయ్యాయి. అవుట్ పోస్టు పోలీసులు తెలిపిన వివరాలు.. ఆదోని నుంచి పెద్దతుంబళం వైపు వెళ్తున్న ఆటో, మంత్రాలయం నుంచి ఆదోని వైపుకు వస్తున్న కారు ఎదురు ఎదురుగా ఢీకొనడంతో ఆటోలో ఉన్న సుహాసిని, అమీన్, ఈరన్నగౌడ్, నరసింహులు గాయపడ్డారు. వెంటనే స్థానికులు క్షతగాత్రులను ఆదోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అక్రమ రిజిస్ట్రేషన్‌లకు కేరాఫ్..

- నకిలీ పత్రాలు పెట్టి ఆస్తుల రిజిస్ట్రేషన్
- ఒకటి మరవక ముందే మరొకటి వెలుగులోకి
- గతంలో చర్యలు తీసుకోకపోవడంతోనే అవినీతికి ఆస్కారం



ఆదోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

ఆదోని అర్బన్: నకిలీ పత్రాలు పెట్టండి కోట్ల ఆస్తులు సొంతం చేసుకోండి అన్న చందంగా మారింది ఆదోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం. ఒకటి మరవకముందే మరొకటి నకిలీ పత్రాల బాగోతం శనివారం బయపడిన విషయం తెలిసిందే. దీంతో ఆదోని పట్టణ ప్రజల్లో ఇలాంటి ఇంకా ఎన్ని జరిగాయి, ఇలాంటివి ఎన్ని జరుగుతాయోనని భయాందోళన చెందుతున్నారు. అంతేగాకుండా తమ ఆస్తులను భూకబ్జాదారుల నుంచి ఎలా కాపాడుకోవాలని ప్రజలు చర్చించుకుంటున్నారు. ఒక ఘటన జరిగి ముడునెలలు గడవక ముందే బతికున్న ఎగ్గటి ఈశ్వరప్ప మరణించాడని అతని పేరుపై ఉన్న రూ.35 కోట్లు విలువ చేసే 6.51 ఎకరాల భూమిని ఎగ్గటి ఆముదాల భాస్కర్ అనే వ్యక్తి చాకలి ఈరన్నకు నకిలీ ఫ్యామిలీ సర్టిఫికెట్, మరణ పత్రంతో రిజిస్ట్రేషన్ చేయించారు. అంతేగాకుండా ఆస్తులపై వెంచర్ వేసి మరో ఇద్దరికి కూడా రిజిస్ట్రేషన్ చేయించాడని తెలిసింది. ఇదంతా గత సంవత్సరం డిసెంబర్ 31వ తేదీన జరిగిన విషయం తెలిసిందే. సబ్‌రిజిస్టర్ కార్యాలయంలోని సిబ్బందిని టూటౌన్ సీఐ సూర్యమోహన్‌రావు విచారణ చేపట్టారు. అయితే అక్రమంగా ఆస్తిని రాయించి ఇచ్చిన ఎగ్గటి ఆముదాల భాస్కర్, రాయించుకున్న చాకలి ఈరన్న పట్టుబడితే తప్పా కబ్జాకు వివరాలు తెలుస్తుందని సీఐ తెలిపారు. ప్రస్తుతం ఆరు మందిపై నాన్‌బెయిలబుల్ కేసు నమోదు చేసినట్లు సీఐ చెప్పారు.

గతంలోనే చర్యలు తీసుకుని ఉంటే..

గతేడాది అక్టోబర్ నెలలో ఆదోని ఎమ్మెల్యే అనుచరుడు డా.రవికిరణ్ తన తల్లి జయలక్ష్మి పేరును కురువ హనుమంతమ్మగా నకిలీ ఆధార్‌కార్డును సృష్టించాడు. కురువ హనుమంతమ్మ పేరుపై ఉన్న రూ.1.80 కోట్లు విలువ చేసే ఆరు సెంట్ల స్థలాన్ని రవికిరణ్ బావమరిది చిప్పల సురేష్‌బాబు పేరుపై స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేయించారు. వెంటనే గుర్తించిన బాధితులు ఫిర్యాదు చేశారు. అప్పుడే అధికారులపై చర్యలు తీసుకుని ఉండి ఉంటే మరలా ఈ భూకబ్జా బాగోతం ఉండేది కాదని ప్రజలు వాపోతున్నారు.